# పోలీసు కిష్టయ్యకు ఘన నివాళి



పోలీసు కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ముదిరాజ్ కులస్తులు

పెద్ద కొడప్‌గల్/పిట్లం, డిసెంబర్ 1: తెలంగాణ మలి దశ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన పోలీసు కిష్టయ్య 14వ వర్ధంతిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పెద్దకొడప్‌గల్‌తోపాటు కాటేపల్లి గ్రామంలో పనుగంటి హన్మాండ్లు ఆధ్వర్యంలో కిష్టయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.జగన్మోహన్ హాజరయ్యారు. ముదిరాజ్ సంఘ సభ్యులు గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కాటేపల్లిలో ముదిరాజ్ సంఘం జెండాను రాష్ట్ర అధ్యక్షుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు కిష్టయ్య వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ముదిరాజ్ కులస్తులను బీసీ 'డీ' నుంచి బీసీ 'ఏ'కు మార్చాలన్నారు. కార్యక్రమాలను నిర్వహించేందుకు సహకరించిన పనుగంటి హన్మాండ్లును అభినందించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాడు హన్మాండ్లు, రాష్ట్ర నాయకుడు పనుగంటి హన్మాండ్లు, జిల్లా నాయకులు ఆనంద్, కరాటే రమేశ్, సర్పంచ్ విఠల్ ముదిరాజ్, బేగంపూర్ సర్పంచ్ శివురాం ముదిరాజ్, మండల, గ్రామ సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

పిట్లంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బుడాల నవీన్, సంఘ సభ్యులు కలిసి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని నిర్వహించారు. కిష్టయ్య చిత్ర పటానికి పూలమాల వేసినివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు దేవేందర్, పోచయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పిట్లంలో..

# మానవత్వం చాటుకున్న హోటల్ యజమాని



కొండాపూర్‌లో బంగారం, పర్సును అందజేస్తున్న హోటల్ యజమాని, స్థానికుడు

రాజంపేట్, డిసెంబర్ 1 : మండలంలోని కొండాపూర్‌లో ఉన్న ఓ హోటల్ యజమాని తన మానవత్వాన్ని చాటుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట మండలం గుడితండా గ్రామ పంచాయతీకి చెందిన రమావత్ జంకి అనే మహిళ శుక్రవారం తన ఇంటినుంచి మూడు తులాల బంగారంతో కొండాపూర్ ఎస్‌బీఐ బ్యాంకులో గోల్డ్ లోన్ తీసుకుందామని వచ్చింది. అయితే బ్యాంక్ సిబ్బంది తర్వాత రమ్మని చెప్పడంతో ఆమె బ్యాంక్ ఎదుట ఉన్న తేలు నారాయణ హోటల్‌లో టీ తాగడానికి వచ్చింది. ఆమె పర్సు అక్కడే పడిపోయింది. అది గమనించక అక్కడి నుంచి వెళ్లిపోయింది. తర్వాత హోటల్‌కు వచ్చిన గణేశ్ నాయక్ ఆ పర్సును గమనించి హోటల్ యజమానికి తెలియజేశాడు. హోటల్ యజమాని తేలు నారాయణ, గణేశ్ నాయక్ పర్సు తీసి చూడగా అందులో పున్న ఫొటో ఆధారంగా రమావత్ జంకిగా గుర్తించి ఆమెను పిలిపించారు. మూడు తులాల బంగారంతోపాటు ఆమె పర్సును అప్పగించారు. ఇది తెలిసిన గ్రామస్తులు హోటల్ యజమాని తేలు నారాయణ, గణేశ్‌నాయక్‌ను అభినందించారు.

# తగ్గిన పోలింగ్ శాతం

- **2018లో 85.56, ప్రస్తుతం 81.80శాతం**
- **మహిళలే అధికం**
- **పెద్దకొడప్‌గల్ మండలంలో అత్యధికంగా 86.28 శాతం**



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

నిజాంసాగర్, డిసెంబర్ 1: జుక్కల్ నియోజకవర్గంలో 2018 ఎన్నికలకు ప్రస్తుత ఎన్నికలకు పోలింగ్ శాతం స్వల్పంగా తగ్గింది. నియోజకవర్గంలో 255 బూత్‌లు ఉండగా 98,635 మంది పురుషులు, 1,01,317 మంది మహిళలు, 10 మంది ఇతరులు కలిపి మొత్తం 1,99,962 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 81,574 మంది పురుషులు, 81,995 మంది మహిళలు కలిపి మొత్తం 1,63,569 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 85.56 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి 81.80 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని మద్నూర్ మండలంలో 80.09 శాతం, డొంగ్లీలో 80.30, జుక్కల్‌లో 79.54, బిచ్కుందలో 79.65, పెద్దకొడప్‌గల్‌లో 86.28, పిట్లంలో 85.78, నిజాంసాగర్ మండలంలో 81.80 శాతం పోలింగ్ నమోదైంది. పెద్దకొడప్‌గల్ మండలం పోలింగ్ శాతంలో మొదటి స్థానంలో ఉండగా.. జుక్కల్ మండలం చివరి స్థానంలో ఉన్నది. నియోజకవర్గంలోని నిజాంసాగర్ మండలంలోని మంగ్లూర్ గ్రామంలో 95.03 శాతం, జక్కాపూర్ గ్రామంలో 94.38, గోర్గల్ గ్రామంలో 94.30 శాతం, మాగి గ్రామంలో 94.14 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు పూర్తికావాల్సి ఉండగా.. కొన్ని గ్రామాల్లో రాత్రి ఆరు, ఆరున్నర గంటల వరకు కొనసాగింది. నియోజకవర్గంలోని జుక్కల్ మండలంలో పోలింగ్ శాతం కొంత తగ్గడంతోనే నియోజకవర్గం మొత్తం 81.80 శాతం పోలింగ్ నమోదైంది.

# గోదావరి పరిక్రమణ యాత్ర ప్రారంభం

రెంజల్, డిసెంబర్ 1: మండలంలోని కందకుర్తి నది ఒడ్డున గల సీతారాం సంత్ సేవా ఆశ్రమ వ్యవస్థాపకుడు సీతారాం త్యాగి మహరాజ్ శుక్రవారం గోదావరి పరిక్రమణ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర త్రయంబకేశ్వర్ (నాసిక్) గోదావరి పుట్టిన స్థలం వరకు 13 రోజుల పాటు కొనసాగుతుందని భక్తులు తెలిపారు. యాత్రలో అయోధ్య మఠాధిపతులు, 300లకు పైగా స్వాములు, భక్తులు, వాహనాల్లో బయల్దేరారు. సీతారాం త్యాగి మహరాజ్, కొందరు భక్తులు మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి రైలులో బయల్దేరారు.



ధర్మాబాద్‌లో రైల్వే స్టేషన్‌లో సీతారాం సంత్ త్యాగి మహరాజ్, భక్తులు

## ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో
# పోలీసు కిష్టయ్య వర్ధంతి



కిష్టయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

ఇందల్వాయి, డిసెంబర్ 1 : మండలంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోలీసు కిష్టయ్య 14వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. లింగాపూర్ చౌరస్తా వద్ద ఉన్న పోలీసు కిష్టయ్య విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మండల అధ్యక్షుడు మొచ్చ గోపాల్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో పోలీసు కిష్టయ్య అమరుడై ఉద్యమానికి ఊపిరిలూదారన్నారు. కార్యక్రమంలో ఆరెట్టి రఘు, శ్రీధర్, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి, మాణిక్యం, గంగసాయిలు, గంగాధర్, గంగనర్సయ్య, మొచ్చ సాయిలు, సతీశ్, స్వామి, సాయేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూమిని పరిశీలించిన అధికారి



భూమిని పరిశీలిస్తున్న అటవీ శాఖ రేంజ్ అధికారి రవిమోహన్ భట్

డిచ్‌పల్లి, డిసెంబర్ 1 : మండలంలోని నక్కల గుట్ట తండా పరిధిలోని నడిమితండా వద్ద ఉన్న అటవీ ప్రాంత భూమిని అటవీశాఖ రేంజ్ అధికారి రవిమోహన్ భట్ శుక్రవారం పరిశీలించారు. కొందరూ అక్రమంగా భూమిని దున్నగా.. పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. ఆయన వెంట సెక్షన్ అధికారి మానస, సాయికృష్ణ, బీట్ అధికారులు ప్రవీణ్, సాయికృష్ణ, బేస్‌క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

## నేడు స్వర్ణామృతం పంపిణీ

నందిపేట్, డిసెంబర్1: మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమం (పలుగుట్ట)పై శనివారం పిల్లలకు స్వర్ణామృత ప్రాశనం పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనతెలిపారు. 15 ఏండ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలకు రోగ నిరోధక శక్తి మేధాశక్తి, జ్ఞాపకశక్తి, శారీరక ఎదుగుదల తదితర ప్రయోజనాలు కలిగించే ఆయుర్వేద దివ్య ఔషధం స్వర్ణామృతాన్ని ప్రతి పుష్యమి నక్షత్రం రోజు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కేదారేశ్వర ఆశ్రమంలోని ఉమామహేశ్వర హాల్‌లో స్వర్ణామృత ప్రాశనం పంపిణీ చేస్తామని, తల్లిదండ్రులు పిల్లలను చేసుకొనిరావాలని కోరారు.

## నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

మెండోరా, డిసెంబర్1: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం నిలకడగా ఉంది. కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 50 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు 152 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్టు 1088.90 అడుగులు (79.310 టీఎంసీలు) నీటి నిల్వ ఉందన్నారు. గతేడాది ఇదే రోజు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టంతో నిండుకుండలా ఉంది.

## 4న రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 1 : రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం, సరస్వతీరాజ్ హరిదా ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు హరిదా రచయితల సంఘం అధికార ప్రతినిధి నరాల సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆర్మూర్‌రోడ్‌లోని నవ్యభారతి గ్లోబల్‌స్కూల్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి, ప్రముఖ రచయిత్రి డాక్టర్ అమృతలత, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శంకర్, నవ్యభారతి విద్యాసంస్థల చైర్మన్ క్యాతం సంతోష్‌కుమార్ తదితరులు హాజరుకానున్నట్లు వివరించారు. రాష్ట్ర నలుమూలల నుంచి కవులు, కవయిత్రులు కవితాగానం చేస్తారని, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు.